క్లుప్తంగా

అందరి సహకారంతోనే స్వచ్ఛత సాధ్యం

నారాయణవనం : అందరి సహకారంతోనే పంచాయతీలో పారిశుద్ధ్యం సాధ్యమైందని నారాయణవనం మేజర్ పంచాయతీ ఈవో షణ్ముగం పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపై రెండు అవార్డులకు ఎంపిక కావడం విశేషమన్నారు. సోమవారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచ్ శారద స్వచ్ఛ పంచాయతీ , స్వచ్ఛ వారియర్ అవార్డును గ్రీన్ అంబాసిడర్ రవి అందుకున్నారు. మంగళవారం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో రవిని పలువురు అభినందించారు.

ఇంటిలో చెలరేగిన మంటలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన ఆనంద్ ఇంటిలో సోమ వారం రాత్రి విద్యుదాఘాతంతో మంటలు చెల రేగి వస్తువులు కాలిపోయాయి. ఇంటిలోని ల్యాప్‌టాప్, టీవీ, ఫ్రిజ్, మిక్సీ, బీరువా, టేబుల్, సీలింగ్ ఫ్యాన్లు, వీటితోపాటు వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆనంద్ కోరారు.

అవకతవకలపై సంతకాల సేకరణ

శ్రీకాళహస్తి : భారత ఎన్నికల సంఘం అవకతవకలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆరోపించారు. శ్రీకాళహస్తి మండలం విశాలాక్షి నగర్‌లో మంగళవారం ఓట్ చోర్‌పై ప్రజాభిప్రాయ సంతకాల సేకరణను కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, ఆంటోని, బద్రి, మహేష్, తరుణ్, అరుణ్, చంద్రు, ప్రశాంత్ పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ : డయేరియా సోకకుండా అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో డయేరియాపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కలుషిత నీరు, ఆహార పదార్థాలు తీసుకోవడం వలన టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని ఆశా కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారిణి జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50,100



విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా భీమునిపాడుకు చెందిన కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి మంగళవారం రూ.50,100 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

గుడ్లూరు ఇండస్ట్రీస్‌కు 'స్వచ్ఛ' అవార్డు



అవార్డు తీసుకుంటున్న దృశ్యం

రేణిగుంట: తిరుపతి జిల్లా ఎంఎస్ఎంఈ విభాగంలో రేణిగుంట పారిశ్రామిక వాడలోని గుడ్లూరు ఇండస్ట్రీస్ స్వచ్ఛ ఆంధ్ర అవార్డును కైవసం చేసుకుంది. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, నాణ్యత పద్ధతులలో అద్భుతమైన విజయాలకుగాను ప్రతిష్టాత్మక స్వచ్ఛ ఆంధ్ర అవార్డును అందుకుంది. 6వ తేదీ జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గుడ్లూరు ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు జగన్ మోహన్ అందుకున్నారు. మంగళవారం వివరాలను మీడియాకు వెల్లడించారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కుమారస్వామి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారికి పలురకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కారిపాకంలో నిర్మాణ దశలో ఆగిపోయిన సచివాలయ భవనం



సత్యవేడులో శ్లాబు దశలో ఆగిపోయిన సచివాలయ భవనం



కేవీబీపురం : ఆగిపోయిన కండ్లూరు సచివాలయ భవనం



బీఎన్‌కండ్రిగ : నిర్మాణ దశలో ఆర్‌అనంతాపురం సచివాలయ భవనం



పునాది దశలో నిలిచిపోయిన నాగలాపురం సచివాలయం-2



పాలకుల నిర్లక్ష్యం.. ప్రజాధనం వృథా

సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకందించడమే కాకుండా ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో పలు ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం మారగానే నిర్మాణాలకు నిర్లక్ష్యపు నీడలు కమ్ముకోవడంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది.

- అసంపూర్తి నిర్మాణాలపై పట్టని ప్రభుత్వం
- అర్ధాంతరంగా ఆగిన సచివాలయ భవనాలు
- గతంలో చేపట్టిన అభివృద్ధి పనులపై కూటమి నిర్లక్ష్యం
- అభివృద్ధి పనుల్లో కూటమి రాజకీయాలు

వరదయ్యపాళెం : నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో గత ప్రభుత్వం 90 సచివాలయాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. అలాగే 90 సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాలను మంజూరు చేసింది. అయితే 42 గ్రామ సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాల నిర్మాణం పూర్తి కావడంతో ఆ భవనాలను ప్రారంభింపజేసి సేవలను కొనసాగిస్తున్నారు. మిగిలిన 48 గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటి వరకు అసంపూర్తిగా నిలిచిన భవనాల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

సత్యవేడు నియోజకవర్గంలో అసంపూర్తి సచివాలయ భవనాల వివరాలు

మండలం	సచివాలయాల పేరు
వరదయ్యపాళెం	కారిపాకం, వరదయ్యపాళెం-2
పిచ్చాటూరు	ఎస్ఎస్‌బీపేట, రామగిరి, పిచ్చాటూరు, వెంగళత్తూరు
సత్యవేడు	దాసుకుప్పం, అంబాకం, మదనంబేడు, సత్యవేడు-1, 2, 3, కాళమనాయుడుపేట, చిన్నఈటీపాకం, రాజగోపాలపురం, పీవీపురం, ఆరూరు,
నాగలాపురం	బీరకుప్పం, కృష్ణాపురం, నాగలాపురం-2, నాగలాపురం-3, ఎస్ఎస్‌పురం, సురుటుపల్లి, టీపీకోట, వేంబాకం
కేవీబీపురం,	ఆదవరం, ఆరె, సూరమాల, కండ్లూరు, కోటమంగాపురం, కోవనూరు, ఎంఏరాజులకండ్రిగ, మిద్దికండ్రిగ, ఓళ్లూరు, పవనవారికండ్రిగ, ఎగువపూడి, రాయపేడు, సదాశివపురం, తిమ్మసముద్రం
నారాయణవనం	తుంబూరు, నారాయణవనం-2,
బీఎస్‌కండ్రిగ	పుత్తేరి, కారణి, ఆలత్తూరు, వెస్ట్ వరత్తూరు, ఆర్‌అనంతాపురం

ప్రజాధనం వృథా సరికాదు



రూ.లక్షలు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టారు. అర్ధాంతరంగా ఆగిన భవనాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. నిర్మాణ దశలోనే వదిలి వేయడం వల్ల ప్రజాధనం వృథా అవుతుంది. పాలకులు దీన్ని గుర్తించాలి.

– చిన్నిరాజ్, సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి

పూర్తయిన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి



లక్షల రూపాయల ప్రభుత్వ ధనాన్ని వినియోగించి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను ప్రజా అవసరాలకు వినియోగించాలి. భవనాలను మూత వేసి ఉంచడం వల్ల ఉపయోగం లేదు. ప్రభుత్వాలు ఏవైనా కావచ్చు. ప్రభుత్వం ద్వారా నిర్మించిన భవనాలను పూర్తి చేయాలి.

– దాసరి జనార్దన్, సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జి

'తపాలా' ప్రత్యేక శిబిరాలు



సతీష్, తపాలా సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్

నారాయణవనం : తపాలా శాఖ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే ప్రత్యేక క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఈనెల 11వ తేదీ శనివారం వరకు జాతీయ తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని సబ్, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తపాలా శాఖ పథకాలు, డిపాజిట్లు, బీమా పాలసీలు-వాటి పరిమితి, సేవింగ్స్ సర్టిఫికెట్లు, పొదుపు ఖాతాల ప్రారంభం.. తదితర సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఓటీపీ ఆధారిత డెలివరీ విధానం ద్వారా ఎవరైనా తపాలా ఆర్టికల్స్‌ను ఇంటి నుంచే బుక్ చేసుకునే వెసులుబాటును తపాలాశాఖ అందిస్తోందన్నారు. చిన్న మొత్తాలను పొదుపు చేసుకునే వెసులుబాటు తపాలా శాఖలో మాత్రమే లభ్యమవుతోందన్నారు. తపాలా శాఖలో పొదుపు, రికరింగ్, ఫిక్స్‌డ్, మంత్లీ ఇన్‌కం స్కీమ్, ఆడపిల్లల భవిష్యతుకు సుకన్య సమృద్ధి యోజక పథకాలతో పాటు తక్కువ ప్రీమియంతో గ్రూప్ ఇన్సూరెన్స్‌ను ప్రతి ఒక్కరూ పొందాలని సతీష్ కోరారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

రేణిగుంట : డప్పు కళాకారుల మండల మహాసభ మంగళవారం రేణిగుంట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మహా సభకు ముఖ్య అతిథులుగా డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో రవిచంద్రకు డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, రెండెకరాలు పొలం ఇవ్వాలని, బస్సు, రైలులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. పెన్షన్ రూ.4000 నుంచి 7 వేలకు పెంచాలని, డప్పు కళాకారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని ప్రతి డప్పు కళాకారుడికి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారులకు దాతల చేయూత



పాండూరు హైస్కూల్ విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

వరదయ్యపాళెం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సహకారం వెలకట్టలేనిదని పాండూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మునిసుబ్రమణ్యం పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో శ్రీకాళహస్తిలో జరిగే జోనల్ క్రీడా పోటీలకు పాండూరు హైస్కూల్ విద్యార్థులు వెళ్లనున్న నేపథ్యంలో వారికి పాఠశాల పూర్వ విద్యార్థి, సిద్ధేశ్వరపురానికి చెందిన రెడ్డి ఆంధ్రా మెస్ అధినేత తులసయ్య క్రీడా దుస్తులను అందజేశారు. మంగళవారం సాయంత్రం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు స్థానిక ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి చేతుల మీదుగా ఆయన అందజేశారు. దాతల స్ఫూర్తితో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హెచ్‌ఎం కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, రఫీ, పిజికల్ డైరెక్టర్ సరళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు లేకుండా ప్రజావేదిక!



వెలవెలబోతున్న ప్రజావేదిక సభ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని నిర్వహించిన ఉపాధి ప్రజావేదికకు ప్రజలే లేకుండా మమ అనిపించారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధి పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రజావేదిక బహిరంగ సభకు ఒక కూలీ కూడా హాజరు కాకపోవడం విస్మయానికి గురిచేసింది. సిబ్బంది, సీఆర్‌పీలు, మాత్రమే హాజరై ప్రజా వేదిక మొక్కుబడిగా నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి నెల వరకు చేపట్టిన 725 పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించినట్లు పీడీ వివరించారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే రికవరీ చేస్తామన్నారు. పలు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్ కూలీలు చెరువుల్లో తవ్విన గుంతల కొలతలు ఎం-బుక్‌లో రికార్డు చేయడంలో తేడాలు రావడంతో రికవరీ చేయాలని ఆదేశించారు. వివిధ పనులకు సంబంధించి జరిమానా రూ.72 వేలు, రికవరీ కింద రూ.70 వేలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తొలగించిన పుత్తేరి ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యంత్రాలతో పనులు చేయకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఎం కోనయ్య, ఎంపీడీఓ మోతి, ఏపీఓ దేవరీ, ఎస్ఆర్‌పీ లోకేష్ పాల్గొన్నారు.

హాజరుకాని ప్రజాప్రతినిధులు

సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీతో సహా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కాలేదు. దీంతో అధికారులను ప్రశ్నించే వారే లేకుండా పోయారు.

మాజీ సైనిక కుటుంబానికి సత్కారం



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న సైనికాధికారులు

శ్రీకాళహస్తి : డెహ్రాడూన్‌లోని ఆర్మీ యూనిట్ డైమండ్ సెలబ్రేషన్‌లో భాగంగా దేశ రక్షణ కోసం తమ సేవలను అందించి రిటైర్డ్ అయిన మాజీ సైనికులు శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పులి శ్రీకాంత్ కుటుంబాన్ని డెహ్రాడూన్ పిలిపించి ఘనంగా సత్కరించారు. వారు అందించిన సేవలను గుర్తు చేసుకొని అభినందిస్తూ వారిని, వారి కుటుంబాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు పులి శ్రీకాంత్ మాట్లాడుతూ.. మాజీ సైనికులు ఇచ్చిన గౌరవాన్ని ఎప్పటికీ మరువలేమని చెప్పారు. కార్యక్రమంలో యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ అలావత్ కే, లెఫ్టినెంట్ కల్నల్ అజయ్ కుమార్, సుబేదార్ మేజర్ అనిల్ , అప్పలరాజు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక కమిటీ ఎన్నిక

రేణిగుంట : రేణిగుంట సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు సమావేశమయ్యారు. సభ్యులు రేణిగుంట మండల అధ్యక్షుడిగా ఖాదర్ బాష, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో శీను, ముని రాజా, శివానందం, గోపి, వాసు, నరేష్, గురవయ్య, చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో చైర్మన్



ఆలయం వద్ద పీవీఆర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ చైర్మన్ పీవీఆర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నకిలీ మద్యం తయారీ సూత్రధారికి బాబు ఆశీస్సులు



ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి

వరదయ్యపాళెం : నకిలీ మద్యం తయారీలో ప్రధాన సూత్రధారి అయిన జయచంద్రా రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన వరదయ్యపాళెం మండలంలో జరుగుతున్న శత వసంతాల శిక్షణా తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల తంబళ్లపల్లిలో నకిలీ మద్యం తయారీ గోడౌన్‌ను ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ మద్యం తయారీలో ప్రధాన సూత్రధారి జయచంద్రారెడ్డిగా గుర్తించారన్నారు. కాగా 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తంబళ్లపల్లి ఎమ్మెల్యే టికెట్ జయచంద్రా రెడ్డికి ఇవ్వడం వెనుక అంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు. నకిలీ మద్యం తయారీలో జయచంద్రా రెడ్డి గత చరిత్ర తెలీదా అని ప్రశ్నించారు.

పంచాయతీలో చేతివాటం!

రేణిగుంట : రేణిగుంట మేజర్ పంచాయతీలో ఓ పంప్ ఆపరేటర్ ఏళ్లుగా పాతుకుపోయారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఆ పార్టీ నేతలతో సన్నిహితంగా ఉంటూ పంచాయతీలో తన మాటే చెల్లుబాటు అయ్యే విధంగా వ్యవహారాలు నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీలో అణువణువు తెలుసు. ఇదే తన ఆయుధంగా మార్చుకొని ఈవోగా ఎవరు వచ్చిన వారిని తన దారికి తెచ్చుకొని పంచాయతీ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఇంటి కొళాయి కనెక్షన్, ఇంటి పన్ను, పేరు మార్పు ఇతర ఏ పని జరగాలన్న ఆ పంపు ఆపరేటర్‌ను కలవాల్సిందే. పనిని బట్టి రూ.10 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేసి పంచాయతీ అధికారులకు వాటాలు అందిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సర్పంచ్, ఈవో ఎవరైన అతడి మాట వినాలి, లేదంటే ఇబ్బందులకు గురి చేస్తాడనే విమర్శలు ఉన్నాయి. గత వారం కిందట జరిగిన గ్రామసభలో స్థానికులు ఆ పంపు ఆపరేటర్ వ్యవహార శైలి, నగదు వసూళ్లపై ఫిర్యాదు చేశారు. ఆ పంప్ ఆపరేటర్ తన పని తాను చేసుకోకుండా కార్యాలయంలోనే ఎందుకు ఉంటున్నట్టు అధికారులే పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లాయర్ల నిరసన



సత్యవేడు కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న లాయర్లు

సత్యవేడు : సుప్రీంకోర్టు సీజేపై జరిగిన దాడి అమానుషమని సత్యవేడు కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వెంకటేశులు అన్నారు. మంగళవారం భోజన విరామ సమయంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిపై స్థానిక కోర్టు ఎదుట లాయర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశులు మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తిపై దాడి ప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయమూర్తుల తీర్పులే కీలకంగా నిలుస్తాయన్నారు. వీరిని భయపెట్టే ప్రయత్నం చేయడం న్యాయవ్యవస్థను కూల్చే ప్రయత్నమే అన్నారు. కార్యక్రమంలో లాయర్లు వెంకటేశ్వర్లు (మధు) మునిశేఖర్, జానయ్య, మునిచంద్రశేఖర్, మునిశేఖర్, రాజేష్, శివానందం , వినోద్, చంద్రశేఖర్, మహేష్ విగ్నేష్, అఖిల పాల్గొన్నారు.

'నీలి నాలుక'తో ముప్పు

- ఆర్బీ వైరస్‌పై అప్రమత్తత అవసరం
- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధి దూరం

సత్యవేడు : వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే నీలి నాలుక వ్యాధి వల్ల గొర్రెలు, మేకలకు ప్రాణహాని ఉందని పశువైద్యులు ఎస్. దయాకర్ తెలిపారు. వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే వైరస్ వల్ల ఏటా 10 శాతం గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నట్లు గణాకాలు చెబుతున్నాయి. చాలా తక్కువ వ్యవధిలో గొర్రెలకు వ్యాపించే ఈ వైరస్ సకాలంలో నివారణ చర్యలు పాటించకపోతే వందల కొద్దీ జీవాలను పొట్టన పెట్టుకునే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గొర్రెల పెంపకం దారులు ముందస్తు టీకాలను వేయించడంతో పాటు వ్యాధి సోకిన గొర్రెలను సరైన చికిత్స అందిస్తూ కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నీలి నాలుక వ్యాధిని కలిగించే వైరస్‌లలో 24 వేరియంట్లు ఉండడం వల్ల వ్యాధి నివారణ టీకాలను తయారు చేయడం కూడా కష్టంగా మారిందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దోమల్ల వ్యాపించే ఈ వ్యాధి మందలోని అన్ని గొర్రెలకు చాలా తక్కువ సమయంలో వ్యాపిస్తుందని, వ్యాధికి గురైన గొర్రెలను గుర్తించి వెంటనే వాటిని మంద నుంచి వేరు చేయాల్సి ఉంటుందన్నారు. వ్యాధి బారిన పడిన పొట్టేలు వీర్యం ద్వారా కూడా ఈ వ్యాధి ఇతర గొర్రెలకు సులువుగా వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

గొర్రెలు, మేకల వివరాలు ఇలా..

సత్యవేడు నియోజకవర్గంలో	గొర్రెలు	మేకలు
సత్యవేడు	24225	21182
నాగలాపురం	7670	8882
వరదయ్యపాళెం	36212	7111
బీఎస్‌కండ్రిగ	30908	10472
పిచ్చాటూరు	6275	10310
నారాయణవనం	5298	6208
కేవీబీపురం	23875	19126

వ్యాధి లక్షణాలు ఇలా..

నీలి నాలుక వ్యాధి బారిన పడిన గొర్రెల్లో తీవ్రమైన జ్వరం (104–106 డిగ్రీల వరకు) ఉంటుంది. వాటి నాలుక వాపు ఉండడమే కాకుండా లేత నీలి రంగులో కనిపిస్తుంది. పెదాలు, చిగుళ్లు, ముఖంలో కూడా వాపు వస్తుంది. ముక్కు, నుంచి నీరు కారుతుంది. కాలిగిట్టల దగ్గర ఎర్రగా వాపు రావడంతో గొర్రెలు నడవడానికి కూడ వీలు కాక కుంటుతాయి. న్యూమోనియా లక్షణాలు ఉన్న గొర్రెల్లో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతోందన్నారు.

చికిత్స విధానం

లక్షణాలు గుర్తించిన తక్షణమే దగ్గరల్లోని పశువైద్యుడి సలహా మేరకు చికిత్స చేసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి బారిన పడిన గొర్రెల నోటిలో వాపు, పుండ్లు ఉండడంతో మేత మేయడానికి కూడా ఇబ్బందులు పడతాయి. సులభంగా జీర్ణమయ్యే గంజి లాంటి ఆహార పదార్థాలను కొద్దిగా ఉప్పు కలిపి తాపించాలి. అందులో ఓఆర్ఎస్ లాంటి ద్రావణాలను కలిపి వ్యాధి తగ్గే వరకు ఇవ్వాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికమ్, లేదా అనాల్జిన్ వంటి మందులను వాడాలి.



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ముందస్తు జాగ్రత్తలు ఇలా..

గొర్రెలు, మేకలు నీలి నాలుక వ్యాధి బారిన పడకుండా నివారించడానికి క్రమం తప్పకుండా బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించాలి. మూడు నెలలు పైబడిన గొర్రె పిల్లలకు 2 ఎంఎల్ చొప్పున మొదటి టీకా వేయించాలి. మళ్లీ 21 రోజులకు బూస్టర్ టీకా వేయించాలి. అక్కడ నుంచి ఏటా ఆగస్టు, అక్టోబరు మధ్య కాలంలో టీకాను క్రమం తప్పకుండా వేయించాలి. గొర్రెల మందను నిలిపే పాకలో దోమలు వ్యాపించకుండా తెరలు కట్టాలి. వేపాకు పొగను వేయాలి.

జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుత వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధుల బారిన పడకుండా జీవాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎప్పటికప్పుడు మందలోని గొర్రెల ఆరోగ్యాన్ని కనిపెట్టుకుని ఉండాలి. నీలి నాలుక వ్యాధితో పాటు ఏ ఇతర జ్వర లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఎస్. దయాకర్, ఇరుగుళం పశువైద్యాధికారి.